దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ కృపేశ్

సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 22 : ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో దోహదం చేస్తాయని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొనసాగుతున్న ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

యాచారం, జూన్ 22 : విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నందివనపర్తి, మేడిపల్లి 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు. దీంతో నందివనపర్తి ఫీడర్ పరిధిలోని నందివనపర్తి, బొల్లిగుట్ట తండా, నట్టెక్‌సింగారం ఇండస్ట్రియల్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మేడిపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోతుల బెడద తీర్చండి

పెద్దఅంబర్‌పేట, జూన్ 22 : కోతులు, కుక్కల బెడదను తీర్చాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డికి పెద్దఅంబర్‌పేట నాయకులు వి.విజయేందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. పెద్దఅంబర్‌పేటలోని 4వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో కుక్కలు, కోతులు ఎక్కువగా ఉన్నాయన్నారు. దాడులు చేసి గాయపరుస్తున్నాయని, వాటిని వెంటనే వేరేచోటుకి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

యాచారం, జూన్ 22 : మండలంలోని గున్‌గల్ గ్రామానికి చెందిన ముత్యాల రాజేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇటీవలె మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.73,000 నగదుతో పాటు పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి క్వింటాల్ బియ్యాన్ని ఉచితంగా అందజేశాడు.

స్కూల్ బ్యాగులు అందజేత

చేవెళ్ల రూరల్, జూన్ 22 : చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పల్‌టెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత నందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాల్‌రెడ్డి, హబీబ్, ఫిరోజ్, జనార్దన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిబట్ల, జూన్ 22: ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌రిధిలోని ఓఆర్ఆర్ బొంగుళూరు నుంచి కోహెడ వెళ్లే సర్వీస్ రోడ్డులో అటవీ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. 50 సంవత్సరాలు వయస్సు కలిగి మృతదేహం ఎత్తు 5.5 అడుగులు బట్టతల తెల్లటి చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. మృతి చెంది రెండు నెలలు అవుతుందని పేర్కొన్నారు. మృతదేహం కోసం ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన

ఆమనగల్లు, జూన్ 22: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్యలక్ష్మి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని పోలేపల్లి, చెన్నంపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు కుమార్ పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఇందిర, దేవేందర్, అంగన్‌వాడీ టీచర్లు అలివేలమ్మ, రాములమ్మ ఉన్నారు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం

శ్రీశైలం

వినయ్

బండ్లగూడ, జూన్ 22: ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి వివరాల ప్రకారం. చిన్నారులు శ్రీశైలం, వినయ్ శనివారం ఆడుకునేందుకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వారి చిన్నమ్మ రాధ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నారులకు తల్లితండ్రులు చనిపోవడంతో పిన్ని రాధ వద్దే ఉండి చదువుకుంటున్నట్లు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిత

ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

పాఠశాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 5వ వార్డు సోలిపూర్ గ్రామంలో దివ్యశక్తి రౌండ్‌టేబుల్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ. 40లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులతో మెరుగైన విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్ కృష్ణవేణి, కమిషనర్ వెంకన్న, వివిధ పార్టీల నాయకులు బాబర్‌ఖాన్, రమేశ్ యాదవ్, ఆంజనేయులు, వెంకటేశ్, ఆనంద్, నర్సింహులు, ప్రవీణ్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, వెంకటేశ్, కుమార్, జంగయ్య, అనిల్, రాజేశ్, వెంకటయ్య, రాఘవేందర్, రాజశేఖర్, శివరాములు, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మక్తగూడలో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

కొత్తూరు, జూన్ 22: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నామని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మక్తగూడలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు రాజు, రవినాయక్, రామ్‌దాస్‌నాయక్, మాజీ ఎంపీటీసీ దర్శన్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్, నాయకులు శ్రీరాములు, మల్లేశ్, రాజు, జయేందర్‌రెడ్డి, పాపిరెడ్డి, రాములు, శ్రీను, శ్రీశైలం, ఆంజేయులు, శేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకుంటాం

షాబాద్, జూన్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులను ఆదుకుంటామని దాతలు రాజు, నరేశ్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని మాచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం యూత్ సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు తదితర సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆకృతి ఫౌండేషన్, వెల్‌స్పన్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 22 : క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ విద్యా సంవత్సరం డిగ్రీలో చేరేందుకు దోస్త్ నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి అంటూ కళాశాల కరపత్రాలను అందజేయడంతో పాటు వసతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్ బీ ప్లస్‌ను సాధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యబోధన ఉంటుందన్నారు.అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రొజెక్టర్లు, వివిధ సబ్జెక్టుల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ వంటి అత్యున్నత విద్యార్హత కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు.

విద్యార్థికి కళాశాల కరపత్రం అందజేస్తున్న ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీంద్రెడ్డి

విద్యాభివృద్ధికి కృషి

కొత్తూరు, జూన్ 22: విద్యాభివృద్ధికి సహకారం అందిస్తానని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పార్టీ నాయకుడు కర్రోళ్ల సురేందర్ అన్నారు. కొత్తూరు జడ్పీహెచ్‌ఎస్‌కు మధ్యాహ్న భోజనానికి వంట పాత్రలు కర్రోళ్ల సురేందర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు చేయూతనిస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంగూర్‌నాయక్, ఉపాధ్యాయులు విజయ్‌సాగర్, గోప్యానాయక్, అనిల్, రాజేందర్, వరుణ్, మహిపాల్, యాదగిరి, మధ్యాహ్న భోజన వంట సిబ్బంది పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ కృష్ణయ్య, కమిషనర్ రఘుకుమార్

పాఠశాలలో నీరు నిలువకుండా చర్యలు

బడంగ్‌పేట, జూన్ 22: నాదర్‌గుల్ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్, కుర్మల్‌గూడ జెఎన్ఎన్‌యూఆర్ఎంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాట్లను విద్యాధికారి కృష్ణయ్య, కమిషనర్ రఘుకుమార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నాదర్‌గుల్ జడ్పీహెచ్ఎస్‌లో వర్షం నీరు నిలువడంతో వరద నీరు పోవడానికి ఏర్పాట్లు చేశారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. కుర్మల్‌గూడలో జెఎన్ఎన్‌యూఆర్ఎంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అవసరమైన సామగ్రి ఏర్పాటుపై చర్చించారు. త్వరలో స్కూల్ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవ తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, జూన్ 22: పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చొరవ తీసుకోవాలని శనివారం శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ సివిల్ కాంట్రాక్టర్లు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులకు గాను పెండింగ్‌లో ఉన్న బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రిని కలిసి పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎం.ప్రభుసాగర్, ఎస్.రాంరెడ్డి, జ్ఞానేశ్వర్ యాదవ్, ఉస్మాన్, సంజీవ, విఠల్‌యాదవ్, రూఫ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణ పనులను చేపట్టండి

బండ్లగూడ, జూన్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిస్మత్‌పూర్ గ్రామంలో రోడ్లన్ని గుంతలమయంగా మారి ఆస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలతో పాటు వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటన్నామని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాలను చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిర్లక్ష్యం ప్రమాదకరం

ఆటోనగర్‌లో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి హాజరై డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాసులు తదితరులు

మన్సూరాబాద్, జూన్ 22: రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లోని శ్రీనివాస ట్రావెల్స్ అండ్ టూర్స్ గ్యారేజీలో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రోడ్లపై వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అతి వేగంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలను క్రమశిక్షణతో నడుపుతూ ప్రజల ప్రాణాలను రక్షించడమే డ్రైవర్ల బాధ్యత అన్నారు. ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైవర్ తన మానసిక స్థితి, ఫిజికల్ ఫిట్‌నెస్ బాగుంటేనే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతాడని తెలిపారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తూ విధిగా సీటు బెల్టును పెట్టుకుని నిర్లక్ష్య ధోరణిని వదలి జాగ్రత్తగా వాహనాన్ని నడుపుతామని మనస్సాక్షిగా డ్రైవర్లు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రాహీంపట్నం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అనూష, శ్రీనివాస ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోటి శ్రీనివాసరావు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ కోఆర్డినేటర్ సావిత్రి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్, టీసీఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.

● ట్రాఫిక్ డీసీపీ వి. శ్రీనివాసులు

ఉపాధి హామీ పనులపై మండల సామాజిక తనిఖీ

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో అధికారి శ్రీలత

మంచాల, జూన్ 22: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం అధికారులు 15వ విడుత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో అధికారి శ్రీలత, అడిషనల్ డీఆర్డీవో సుభాషిణి హాజరయ్యారు. మంచాల మండలంలోని 23గ్రామ పంచాయతీ పరిధిలో 2023నుంచి 2024 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం మండలంలో జరిగిన పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ సభ్యులు వెళ్లి పరిశీలించిన విషయాన్ని మండల సామాజిక తనిఖీ సభలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్మద, మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామాల్లో జరిగిన పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్‌తో పాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్సై రాజు

తుర్కయాంజాల్, జూన్ 22 : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత, విద్యార్థులు సహకరించాలని ఆదిబట్ల ఎస్సై రాజు కోరారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో న్యూ శ్రీచైతన్య జూనియర్ కాలేజ్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా డ్రగ్స్ రహిత సమాజం నిర్మించేందుకు సహకరించాలని అన్నారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా అమ్మితే కఠిన చర్యలు

సాలార్‌పూర్ తండాలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్

కడ్తాల్, జూన్ 22 : సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ అన్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆదేశాల మేరకు ఆమనగల్లు సీఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు, శనివారం కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. కడ్తాల్ మండలంలోని సాలార్‌పూర్ తండాలో ఐదు లీటర్లు, తలకొండపల్లి మండలం తుమ్మలకుంట తండాలో మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మొత్తం నాలుగు కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లో నాటు సారా తయారు చేయవద్దని గిరిజనులకు ఆయన అవగాహన కల్పించారు. ఎక్కడైనా సారా తయారు చేసినా, బెల్లం, పటిక విక్రయిస్తే 87126 58742, 90005 71671కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వారి వెంట డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, హెచ్‌సీ శంకర్, ఈసీ దశరథ్, సిబ్బంది ఉన్నారు.

పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తాం

కడ్తాల్ (తలకొండపల్లి), జూన్ 22: పేద విద్యార్థుల చదువులకు అన్ని విధాలా సహకరిస్తామని జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని పాతకోట తండాకు చెందిన చిట్టి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించారు. అప్పటి నుంచి చిట్టి తండాలోని తాత తావుర్యానాయక్ వద్దే ఉంటుంది. చిట్టిని చదివించడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో, చిన్నారి చదువుకు సహకరించాలని తండావాసులు జడ్పీటీసీని కోరారు. ఈ మేరకు శనివారం ఆమనగల్లు పట్టణంలోని ప్రజ్ఞ రెసిడెన్షియల్ స్కూల్‌లో చిట్టిని ఆరవ తరగతిలో చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ తరుపున అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్‌గా హనుమంత్‌రెడ్డి

మంచాల, జూన్ 22: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన వెదిర హనుమంత్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి విజయ, శనివారం సాయంత్రం హనుమంత్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. మంచాల సహకార సంఘం చైర్మన్ ఎన్నిక కోసం కాంగ్రెస్ నుంచి వెదిర హనుమంత్‌రెడ్డి నామినేషన్ వేయగా బీజేపీ నుంచి కొంగర జనార్దన్‌రెడ్డి నామినేషన్ వేయడంతో ఇద్దరి మధ్య ఎన్నికలు నిర్వహించారు. అందులో హనుమంత్‌రెడ్డికి అధికారులు కేటాయించిన గుర్తుపై 8మంది ఓటు వేయగా బీజేపీకి చెందిన జనార్దన్‌రెడ్డికి ఇద్దరు ఓటు వేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయ హనుమంత్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికైనట్లు అధికారికంగా అతడికి నియామక పత్రాన్ని అందజేశారు.

హనుమంత్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

ఘన సన్మానం

సంఘం చైర్మన్‌గా హనుమంత్‌రెడ్డి ఎన్నిక కావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు సంఘం కార్యాలయంలో హనుమంత్‌రెడ్డిని సన్మానించి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, మంచాల సహకార సంఘం బ్యాంకు సీఈవో శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ హత్య..!

ప్రియుడే హత్య చేసి గుంత తీసి పాతిపెట్టిన వైనం
షాబాద్ మండలం బోనగిరిపల్లి సమీపంలో ఘటన

పోస్టుమార్టం నిర్వహిస్తున్న ఉస్మానియా దవఖాన వైద్యులు

సంతోష (ఫైల్)

షాబాద్, జూన్ 22: మూడు నెలల క్రితం అదృశ్యమైన మహిళ హత్యకు గురైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ గ్రామానికి చెందిన తొంట సంతోష (30) ఈ ఏడాది మార్చి నెల చివరి వారం నుంచి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుమారుడు సంతోష్ ఏప్రిల్ 7వ తేదీన షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పట్లో అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లి గ్రామానికి చెందిన సద్దుల సత్తయ్య అనే వ్యక్తితో సంతోషకు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా అసలు విషయం బయటపడింది. హాజిపల్లి గ్రామానికి చెందిన సత్తయ్యతో సంతోషకు రెండేండ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు తెలిసింది. షాబాద్ మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామ సమీపంలో ఉన్న కోల్‌బోరాట అనే వెంచర్‌లో సత్తయ్య నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. కాగా, వారిద్దరూ వెంచర్ వద్ద, ఆమె ఇంటి వద్ద తరచుగా కలిసేవారు. కొన్ని రోజుల తర్వాత సంతోష సత్తయ్యను దూరం పెట్టింది. దీంతో అందుకు కారణం ఏంటని ఆమెతో ఆరా తీయగా ఆమెకు వేరే వ్యక్తులతో వివాహేతర సంబంధాలు ఉన్నాయని అనుమానించాడు. దీంతో అతడు ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. మార్చి 28వ తేదీన సత్తయ్య బోనగిరిపల్లి సమీపంలోని కోల్‌బోరాట వెంచర్‌లో డ్యూటీ చేస్తుండగా తొంట సంతోష అక్కడికి వచ్చింది. నువ్వు ఇతరులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ నన్ను ఎందుకు పట్టించుకోవడం లేదని అనుమానించి సత్తయ్య ఆమెతో గొడవపడ్డాడు. ఆ సమయంలో సత్తయ్య కర్ర తీసుకుని సంతోష తల, శరీర భాగాలపై కొట్టడంతో ఆమెకు రక్త స్రావం రావడంతో కిందపడిపోయింది. వెంచర్ పక్కనే ఉన్న వరద కాల్వలో గుంత తీసి అందులో ఆమెను పాతిపెట్టాడు. మరుసటి రోజు అతను పనిని వదిలిపెట్టి అక్కడి నుంచి పారిపోయాడు. శనివారం అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్, స్థానిక సీఐ కాంతారెడ్డి నేతృత్వంలో స్థానిక తహసీల్దార్ అన్వర్ ఆధ్వర్యంలో ఘటనా స్థలంలో శవాన్ని బయటకు తీయించి పంచానామా చేశారు. అనంతరం ఉస్మానియా దవాఖాన వైద్యులతో పోస్టుమార్టం నిర్వ